సాక్షి కామారెడ్డి
మంగళవారం ¦ 28 ¦ నవంబర్ ¦ 2023



తెలంగాణకు అదృష్టం

కామారెడ్డి నుంచి కేసీఆర్ పోటీ చేయడం ఉత్తర తెలంగాణ అదృష్టమని రాజ్యసభ సభ్యుడు సురేశ్ రెడ్డి పేర్కొన్నారు.

- 6లో ▸



బాన్సువాడ బాద్‌షా ఎవరో

బాన్సువాడ నియోజకవర్గంలో త్రిముఖ పోరు నెలకొంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు గెలుపు కోసం శ్రమిస్తున్నారు.

- 6లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.1 /20.2

ఆకాశం మేఘావృతమవుతుంది. చలి గాలులు వీస్తాయి. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలున్నాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు కామారెడ్డిలో కేటీఆర్ రోడ్‌షో

కామారెడ్డి టౌన్: జిల్లాకేంద్రంలో మంగళవారం రోడ్‌షో నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. మంత్రి కేటీఆర్ పాల్గొనే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో..

కామారెడ్డి పట్టణంలో ఎన్నికల ప్రచారానికి చివరిరోజైన మంగళవారం రోడ్‌షోకు కాంగ్రెస్ ప్రణాళిక రూపొందించింది. ఇందులో పీసీసీ చీఫ్, కామారెడ్డి అభ్యర్థి రేవంత్‌రెడ్డి పాల్గొంటారని కాంగ్రెస్ నేతలు తెలిపారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

కామారెడ్డి పట్టణంలో మంగళవారం భారీ రోడ్‌షో, బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు బీజేపీ అభ్యర్థి వెంకటరమణారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవునిపల్లిలోని శివాలయం నుంచి కార్యక్రమం ప్రారంభమై పురవీధుల్లో కొనసాగుతుందని పేర్కొన్నారు. కార్యకర్తలు, నాయకులు భారీ సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

లింగంపేట: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని సోమవారం ఎస్పీ సింధు శర్మ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మోతె, లింగంపేట గ్రామాల్లోని ఐదు పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించామన్నారు. ఈనెల 30 న పోలింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి నిఘా ఏర్పాటు చేయాలని స్థానిక పోలీసులకు సూచించారు. పోలింగ్ బందోబస్తుపై సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆమె వెంట ఎస్సై ప్రభాకర్, సిబ్బంది ఉన్నారు.

ప్రకటనలకు ముందస్తు అనుమతి తప్పనిసరి

కామారెడ్డి క్రైం: అభ్యర్థులు రాజకీయ ప్రకటనలకు సంబంధించి జిల్లా మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి జితేష్ వి పాటిల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చివరి క్షణంలో జారీ చేసే రాజకీయ ప్రకటనలు ఓటర్లను తప్పుదారి పట్టించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అలాంటి సమయంలో బాధితులు వాటిపై స్పందించి స్పష్టత ఇచ్చేందుకు సమయం ఉండదని, అందుకే ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకుందని వివరించారు. పోలింగ్‌కు ముందురోజు, పోలింగ్ రోజుకు సంబంధించిన ప్రింట్ మీడియా ప్రకటనల (కంటెంట్)ను జిల్లా స్థాయిలోని ఎంసీఎంసీకి రెండు రోజుల ముందే సమర్పించి ధ్రువీకరించుకోవాలని సూచించారు.

మీడియా నిబంధనలు పాటించాలి..

టీవీ, రేడియో చానళ్లు, కేబుల్ ఆపరేటర్లు, సోషల్ మీడియా ప్లాట్‌ఫారాలు ఎన్నికల నిబంధనలకు లోబడి తమ వార్తలను ప్రసారం చేయాలని కలెక్టర్ సూచించారు. ఓటర్లను, ఫలితాలను ప్రభావితం చేసేలా కంటెంట్ ఉంటే రెండేళ్ల వరకు జైలు శిక్ష, జరిమానాలు విధించే అవకాశాలు ఉంటాయని హెచ్చరించారు. ఎలాంటి ప్యానల్ చర్చలు, చర్చాగోష్ఠులు, ఒపీనియన్ పోల్స్, ఎగ్జిట్ పోల్స్ నిర్వహించరాదని సూచించారు.

వలస నేతలను నమ్మొద్దు

- నేను లోకల్.. ఎప్పటికీ అందుబాటులో ఉంటా
- ప్రచారంలో బీజేపీ అభ్యర్థి వెంకటరమణారెడ్డి



ఎల్పుగొండలో మాట్లాడుతున్న వెంకటరమణారెడ్డి

మాచారెడ్డి: తమ స్వార్థ ప్రయోజనాల కోసం వలసవచ్చి పోయే నేతలను నమ్మొద్దని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటరమణారెడ్డి కోరారు. సోమవారం ఆయన పాల్వంచ, వాడి, ఎల్పుగొండ, మంథని దేవునిపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థుల్లో ఎవరు గెలిచినా ఒకరు కొడంగల్, ఇంకొకరు ఫామ్ హౌజ్‌లో ఉంటారన్నారు. తాను లోకల్ అని, ఏ రాత్రి తలుపు తట్టినా అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. ఓట్ల కోసం కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ప్రజలను ప్రలోభాలకు గురి చేస్తున్నాయని ఆరోపించారు. ఎవరెన్ని జిమ్మిక్కులు చేసినా కామారెడ్డిలో కాషాయ జెండా ఎగరడం ఖాయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పొన్నాల వెంకట్‌రెడ్డి, మండల అధ్యక్షుడు నర్సింహాచారి, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



బాన్సువాడలో మాట్లాడుతున్న జేపీ నడ్డా
బాన్సువాడ సభలో పాల్గొన్న జనం

ఆ రెండూ అవినీతి పార్టీలే

- బీఆర్ఎస్ అంటే భ్రష్టాచార్ రాక్షస సమితి
- ఆకాశం, భూమి ఏదీ వదలకుండా స్కాంలు చేసిన కాంగ్రెస్
- అధికారంలోకి వస్తే ధరణిని రద్దు చేస్తాం
- పేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తాం
- ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు వేస్తాం
- బాన్సువాడ, మద్నూర్ సభలలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా

బాన్సువాడ/మద్నూర్: బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ అవినీతి పార్టీలేనని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా విమర్శించారు. తెలంగాణను కాపాడుకోవడం, సీఎం కేసీఆర్ అవినీతిని అంతం చేయడానికి ఈ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని ప్రజలను కోరారు. సోమవారం ఆయన జిల్లాలో పర్యటించారు. బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో, జుక్కల్ నియోజకవర్గంలోని మద్నూర్ మండలం మేనూర్ సమీపంలో జాతీయ రహదారి 161పై గల మైదానంలో నిర్వహించిన సకల జనుల విజయ సంకల్ప సభలలో ఆయన ప్రసంగించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు కుటుంబ పాలనతో లక్షల కోట్ల రూపాయల విలువైన ప్రజాధనాన్ని దోచుకున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ 2జీ, క్రీడలు, బొగ్గు, బియ్యం ఇలా దేనినీ వదలకుండా అక్రమాలకు పాల్పడిందన్నారు. బీఆర్ఎస్ అంటే భ్రష్టాచార్ రాక్షస సమితి అని పేర్కొన్నారు. ఎందరో అమరుల త్యాగాలతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం ప్రస్తుతం కేసీఆర్ కుటుంబ పాలనలో మగ్గిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

బీజేపీని గెలిపిస్తే..

రాష్ట్రంలో బీజేపీని గెలిపిస్తే అర్హులకు ఇళ్లు నిర్మించి ఇస్తామని నడ్డా హామీ ఇచ్చారు. వరి ధాన్యానికి రూ. 3,100 మద్దతు ధర కల్పిస్తామని, విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు ఇస్తామని, ఆరునెలల్లో గ్రూప్ వన్, టూ నోటిఫికేషన్లు వేసి 2,500 ఉద్యోగాలు భర్తీ చేస్తామని, ఏడాదికి 4 సిలిండర్లు ఉచితంగా ఇస్తామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వమే పేదలకు రేషన్ దుకాణాల ద్వారా ఉచితంగా బియ్యం సరఫరా చేస్తోందన్నారు. త్వరలో గోధుమలు కూడా పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. తాము అధికారంలోకి వస్తే బీసీ వర్గాలకు చెందిన వ్యక్తిని ముఖ్యమంత్రిని చేస్తామని స్పష్టం చేశారు.

ధరణి పోర్టల్ పేరుతో పేదల భూములు లాక్కున్నారని ఆరోపించారు. తాము అధికారంలోకి రాగానే ధరణి పోర్టల్‌ను రద్దు చేస్తామన్నారు. బీజేపీ హయాంలోనే రాష్ట్రంలో ఎక్కువ జాతీయ రహదారులు నిర్మించామని, అవి మీ కళ్లముందే ఉన్నాయని పేర్కొన్నారు. డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వకుండా కేసీఆర్ పేదలను మోసం చేశారని, ప్రధాన మంత్రి అవాస్ యోజననూ అడ్డుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడు ఆకాశం, సముద్రం, భూమి.. ఇలా దేనిని వదలకుండా అవినీతికి పాల్పడిందని, అలాంటి పార్టీకి రాష్ట్రంలో అవకాశం ఇవ్వవద్దని కోరారు. బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పాలంటే జుక్కల్‌లో అరుణతార చెల్లిని, బాన్సువాడలో యెండల లక్ష్మీ నారాయణను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



మేనూర్‌లో ప్రజలకు అభివాదం చేస్తున్న నడ్డా, చిత్రంలో బీజేపీ జుక్కల్ అభ్యర్థి అరుణతార

కేడర్‌లో ఉత్సాహం

బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాలలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నిర్వహించిన ప్రచార సభల తో ఆ పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం కనిపిస్తోంది సభలకు జనం భారీగా తరలిరావడంతో జోష్ పెరిగింది.

బాండ్ పేపర్ రాసిచ్చిన యెండల..



వచ్చే ఎన్నికల్లో గెలిపిస్తే ప్రజలకు నమ్మకం ఉండేందుకు బీజేపీ అభ్యర్థి యెండల లక్ష్మీ నారాయణ బాండ్ పేపర్ రాసి, పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డాకు అందించారు. నన్ను నమ్మి ఓట్లేసిన ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయనని, నిస్వార్థంగా ప్రజా సేవ చేస్తానని, పదేళ్లలో జరిగిన అవినీతిపై విచారణ జరిపిస్తానని, ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటానని, మాట తప్పితే తన పదవికి రాజీనామా చేస్తానని ఆ బాండ్ పేపర్‌లో పేర్కొన్నారు. సభలలో బీజేపీ నాయకులు సంగప్ప, చీదరి సాయిలు, మోహన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, స్వామియాదవ్, అర్షపల్లి సాయిరెడ్డి, దొరబాబు, శ్రీనివాస్ కార్గే, డాకయ్య, పైడిమల్ లక్ష్మీనారాయణ, శంకర్‌గౌడ్, కోనాల గంగారెడ్డి, కొండని గంగారాం, చీకట్ల రాజు, సాయిబాబా, రాజాసింగ్, శ్యాం, అశ్విన్, ముత్యాల సాయిబాబా, భాస్కర్‌రెడ్డి, శివశంకర్, విశాల్ తదితరులు పాల్గొన్నారు.



మేనూర్ సభలో పాల్గొన్న ప్రజలు

నిజాంషుగర్స్‌ను తెరిపిస్తాం

బోధన్ : బీజేపీ అధికారంలోకి రాగానే నిజాంషుగర్స్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని జేపీ నడ్డా హామీ ఇచ్చారు. సోమవారం బోధన్ పట్టణంలోని ఎన్ఎస్ఎఫ్ మైదానంలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ ఇప్పటికే రామగుండం ఫ్యాక్టరీని తెరిపించారన్నారు. నిజామబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటవుతుందన్నారు. బీజేపీ మేనిఫెస్టోలోని ప్రతి హామీని నెరవేరుస్తామన్నారు.



బాన్సువాడలో అభివాదం చేస్తున్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, అభ్యర్థి యెండల లక్ష్మీనారాయణ, నాయకులు

అన్న కోసం తమ్ముడు..

- రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచార బాధ్యతలు మోస్తున్న కొండల్‌రెడ్డి
- కామారెడ్డిలోనే మకాం
- చేరికలతోపాటు ప్రచారం పైనా ఫోకస్



కామారెడ్డి టౌన్‌లో ప్రచారం చేస్తున్న కొండల్‌రెడ్డి(ఫైల్)

సాక్షి, కామారెడ్డి: కామారెడ్డినుంచి పోటీ చేస్తున్న పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యవహారాలను ఆయన సోదరుడు కొండల్ రెడ్డి దగ్గరుండి చూసుకుంటున్నారు. అన్న గెలుపుకోసం తెలవారకముందు కసరత్తు మొదలుపెట్టి అర్ధరాత్రి వరకు శ్రమిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ రేవంత్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయగానే కొండల్‌రెడ్డి కామారెడ్డిలో వాలిపోయారు. ఇక్కడే మకాం వేసి అన్నీ తానై వ్యవహరిస్తున్నారు. కామారెడ్డి పట్టణంలో రోజూ ఉదయమే ఏదో ఒక గల్లీలో తిరుగుతున్నారు. వాకర్స్, మున్సిపల్ కార్మికులను కలుస్తూ కాంగ్రెస్ గ్యారంటీ పథకాల గురించి వివరిస్తున్నారు. సామాన్యులు ఉండే ప్రాంతాల్లో రోజుకో చోట సమావేశాలు నిర్వహిస్తూ కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరుతున్నారు. ఇతర పార్టీల నేతలను పార్టీలో చేర్చుకోవడంలోనూ దూకుడుగా వ్యవహరిస్తున్నారు. దీంతో దోమకొండ జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, భిక్కనూరు ఎంపీపీ గాల్‌రెడ్డి, అంబారీపేట ఎంపీటీసీ ఫిరంగి రాజేశ్వర్, కౌన్సిలర్లు రమేశ్, రవీందర్‌గౌడ్, వనిత తదితరులు కాంగ్రెస్‌లో చేరిపోయారు.

నేతల మధ్య సమన్వయం..

పార్టీ నేతల మధ్య సమన్వయం కుదర్చడంతో పాటు నిత్యం వారితో కలిసి ప్రచార కార్యక్రమాల రూపకల్పన చేయడం వరకు కొండల్‌రెడ్డే చూసుకుంటున్నారు. నాయకులు, కార్యకర్తలకు ప్రచార సామగ్రి, వాహనాలను సమకూర్చడం నుంచి భోజనాలు, ఇతర సౌకర్యాలు కల్పించడం వరకు క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. సంఘాలతో సంప్రదింపులు జరుపుతూ వారి మద్దతు కూడగట్టేందుకు కృషి చేస్తున్నారు.

సభలు, రోడ్‌షోలు..

జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభ తర్వాత ప్రభుత్వ డిగ్రీ కాలేజీ గ్రౌండ్స్‌లో నిర్వహించిన రాహుల్ సభలకు జన సమీకరణ బాధ్యతలన్నీ కొండల్‌రెడ్డే చూసుకున్నారు. స్థానిక నేతల సహకారంతో వాటిని విజయవంతం చేశారు. రెడ్డిపేట, ఇసాయిపేట, మాచారెడ్డి, చుక్కాపూర్, ఫరీదుపేట, భిక్కనూరు, రాజంపేట తదితర ప్రాంతాల్లో జరిగిన రోడ్‌షోలకు సంబంధించిన జనసమీకరణ విషయంలోనూ కొండల్‌రెడ్డి చురుకుగా పనిచేశారు.

తండ్రి కోసం తనయుడు..

- సీఎం కేసీఆర్ తరఫున అన్నీ తానైన కేటీఆర్
- ఎన్నికల వ్యూహాల నుంచి ప్రచారం దాకా పర్యవేక్షణ
- రోజూ ఫోన్‌ద్వారా నేతలకు మార్గదర్శనం చేస్తున్న మంత్రి



భిక్కనూరులో రోడ్‌షో నిర్వహిస్తున్న కేటీఆర్(ఫైల్)

సాక్షి, కామారెడ్డి: అసెంబ్లీ ఎన్నికల్లో కామారెడ్డినుంచి బరిలో నిలిచిన సీఎం కేసీఆర్ గెలుపు బాధ్యతలను ఆయన తనయుడు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీసుకున్నారు. పార్టీ అభ్యర్థులను ప్రకటించిన తరువాత అక్టోబర్ 7న కామారెడ్డి పట్టణంలో నిర్వహించిన నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. వంద మందికి ఒక ఇన్‌చార్జీ ఉండేలా బూత్‌కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆరోజు నుంచి నిరంతరం ఎన్నికల ప్రచారంతో పాటు పార్టీని సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. పార్టీలో విభేదాలపై చర్చించి, నేతల మధ్య సమన్వయం కుదిర్చే ప్రయత్నం చేశారు. 9న సీఎం కేసీఆర్ బహిరంగ సభ విజయవంతానికి కృషి చేసిన కేటీఆర్.. వీలు చిక్కినప్పుడల్లా నియోజకవర్గంలో రోడ్‌షోలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. జిల్లా కేంద్రంలో వివిధ వర్గాల వారితో సమావేశమై వారి మద్దతు కూడగడుతున్నారు. మంగళవారం మరోసారి జిల్లా కేంద్రంలో రోడ్‌షో నిర్వహించనున్నారు.

అభివృద్ధి, సంక్షేమాలను వివరిస్తూ..

కేటీఆర్ సభల్లో ప్రత్యర్థులపై తనదైన శైలిలో విమర్శలు చేస్తున్నారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఓట్లు అభ్యర్థించాలని కార్యకర్తలకు సూచిస్తున్నారు.

రోజూ సమీక్ష..

నియోజకవర్గంలో ఎన్నికల ప్రచార సరళి, ప్రజల స్పందన, పార్టీలో చేరికలు, బలాబలాలపై రోజూ పార్టీ నేతలతో సమీక్షిస్తున్నారు మంత్రి కేటీఆర్. ముఖ్యనేతలకు ఎప్పటికప్పుడు ఫోన్ చేసి మాట్లాడుతూ దిశానిర్దేశం చేస్తున్నారు. తెలంగాణ ఉద్యమకారులు, ఇతర వర్గాల వారితోనూ ఫోన్ ద్వారా మాట్లాడి, మద్దతును కోరుతున్నారు. ఇతర పార్టీలకు చెందిన నేతలను పార్టీలోకి రప్పించే విషయంలోనూ కేటీఆర్ చొరవ చూపారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు వేణుగోపాల్‌గౌడ్‌కు గులాబీ కండువా కప్పేశారు. అలాగే మాచారెడ్డి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గణేశ్‌నాయక్‌ను పార్టీలోకి ఆహ్వానించారు. కేసీఆర్‌కు భారీ మెజారిటీ సాధించాలన్న లక్ష్యంతో ఆయన ముందుకు సాగుతున్నారు.

మిగిలింది కొన్ని గంటలే..

- నేటి సాయంత్రంతో ముగియనున్న ఎన్నికల ప్రచారం
- తెరలేవనున్న ప్రలోభాల పర్వం
- ఆఖరి ప్రయత్నాల్లో అభ్యర్థులు



సాక్షి, కామారెడ్డి: అసెంబ్లీ ఎన్నికల ప్రచార ఘట్టం మరికొన్ని గంటల్లో ముగియనుంది. మంగళవారం సాయంత్రం 5 గంటలకు ప్రచారం ముగించాల్సి ఉంటుంది. మిగిలి ఉన్న కొద్ది సమయాన్ని సద్వినియోగం చేసుకోవడానికి అభ్యర్థులు శ్రమిస్తున్నారు.

జిల్లాలో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. అన్ని చోట్లా మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులు నువ్వానేనా అన్నట్లుగా తలపడుతున్నారు. అధికార పార్టీ నెల రోజుల ముందు నుంచే ప్రచారం మొదలుపెట్టి దూసుకుపోయింది. బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థుల ప్రకటనలో ఆలస్యం కావడంతో ప్రచారం కాస్త ఆలస్యంగా మొదలైనా దీటుగానే సాగుతున్నాయి. ప్రచార పర్వం ముగింపు దశకు రావడంతో.. మంగళవారం అన్ని నియోజకవర్గాలలో ర్యాలీలు, రోడ్‌షోలతో పాటు ఇంటింటి ప్రచారం నిర్వహించేందుకు ఆయా పార్టీలు ప్రణాళికలు రూపొందించుకున్నాయి.

కామారెడ్డిలో బీజేపీ అభ్యర్థి వెంకటరమణారెడ్డి పట్టణంలో మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ర్యాలీకి అనుమతి తీసుకున్నారు. బీఆర్ఎస్ కూడా రోడ్‌షో నిర్వహించనుంది. కాంగ్రెస్ పార్టీ కూడా పట్టణంలో విస్తృత ప్రచారం నిర్వహించేందుకు ప్రయత్నిస్తోంది. బాన్సువాడ, ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాల్లోనూ ఆయా పార్టీల అభ్యర్థులు చివరి రోజూ సాయంత్రం 5 గంటల దాకా వీలైనంత ఎక్కువ మందితో ర్యాలీలు నిర్వహించేందుకు ప్లాన్ చేశారు. 28 సాయంత్రం 5 గంటల తరువాత సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించడానికి అవకాశం ఉండదు. అలాగే ప్రచార సమయం ముగిసిన తర్వాత ఇతర నియోజకవర్గాలకు చెందిన వారు ఆయా ప్రాంతాలను వదిలి వెళ్లిపోవాల్సి ఉంటుంది. ఎన్నికల సమయం ముగిసేవరకు ఎక్కడా ఐదుగురికి మించి గుమిగూడడం నిషిద్ధం. ప్రచార సమయం ముగిసిన తర్వాత పార్టీ కండువాలు, జెండాలు, లేకుండా ఇద్దరు ముగ్గురు కలిసి ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలవడానికి అవకాశం ఉంటుంది. ర్యాలీలకు మాత్రం అనుమతి ఇవ్వరు.

ఎన్నికల ఏర్పాట్లలో యంత్రాంగం..

పోలింగ్ కోసం అధికార యంత్రాంగం సర్వసన్నద్ధమైంది. ఇప్పటికే పోలింగ్ అధికారులు, సిబ్బంది, రూట్ ఆఫీసర్లకు ఆయా అంశాలపై శిక్షణ ఇచ్చారు. వారికి కావలసిన వాహనాలను సిద్ధం చేశారు. పోలింగ్‌కు ముందురోజే సిబ్బంది ఎన్నికల సామగ్రితో కేంద్రాలకు వెళ్లాల్సి ఉంటుంది. పోలీస్ బందోబస్తు నడుమ ఈవీఎంలను కేంద్రాలకు తరలిస్తారు. జిల్లా అధికారులంతా పోలింగ్ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

జోరుగా విందులు...

రాజకీయ పార్టీలు రోజూ వివిధ కుల సంఘాల వాళ్లకు విందులు ఏర్పాటు చేస్తున్నాయి. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు ఓట్ల వేటలో ఎక్కడికక్కడ విందులు ఏర్పాటు చేసి ఖుషీ చేస్తున్నారు. కొన్నిచోట్ల మందుకోసం టోకెన్‌లు ఇస్తున్నారు. మరికొన్ని చోట్ల ముందుగానే స్టాక్ చేసిన మద్యం సీసాలను ఇంటింటికీ పంపిణీ చేస్తున్నారు. పోలింగ్ సమీపిస్తున్న సమయంలో మరింతగా మద్యం ఏరులై పారుతుందని భావిస్తున్నారు.

క్లుప్తంగా

నగదు పట్టివేత



నిజాంసాగర్: మండలంలోని బ్రాహ్మణపల్లి గేటు వద్ద సోమవారం రూ.61,200 నగదు పట్టుకున్నట్లు ఏఎస్సై రాజేశ్వర్ తెలిపారు. నాందేడ్ - సంగారెడ్డి జాతీయ రహదారిపై వెళ్తున్న ప్రైవేట్ వాహనాలను తనిఖీ చేయగా ఆటోలో వెళ్తున్న వ్యక్తి వద్ద నగదు దొరికిందన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలి



కామారెడ్డిఅర్బన్: జిల్లాలో ఎన్నికలు ప్రజాస్వామ్యయుతంగా, పక్షపాతం లేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని తెలంగాణ ప్రజా ఐక్యవేదిక(టీపీ జేఏసీ) నాయకులు కలెక్టర్ జితేష్ వి పాటిల్‌కు విజ్ఞప్తి చేశారు. సోమవారం సాయంత్రం కలెక్టర్‌తో పాటు కామారెడ్డి రిటర్నింగ్ అధికారిని కలిసి వినతి పత్రాలు అందజేశారు. ఎన్నికల అధికారులు కొందరు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నట్టు ప్రజల్లో అభిప్రాయం ఉందని, బాధ్యతాయుతంగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఓటర్లకు డబ్బులు, మద్యం పంపిణీపై నిఘా పెట్టాలన్నారు. కన్వీనర్ జి జగన్నాథం, కో కన్వీనర్ వీఎల్ నర్సింహరెడ్డి, న్యాయవాదులు ఎం వెంకట్‌రాంరెడ్డి, క్యాతం సిద్దిరాములు, ఎండీ అన్వర్ అలీ, పి బాల్‌రెడ్డి, బి అంగరాజ్ పాల్గొన్నారు.

'జన గణన చేయలేమని బీజేపీ చేతులెత్తేసింది'



కామారెడ్డి రూరల్: జనగణన చేయలేమని సుప్రీంకోర్టుకు తెలిపి బీజేపీ చేతులెత్తేసిందని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ అన్నారు. సోమవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడారు. కామారెడ్డిలో సీఎం కేసీఆర్ గెలుపునకు అనుకూల పరిస్థితులు ఉన్నాయన్నారు. ముదిరాజుల్లో అవకాశం ఉన్నవారికి రాజకీయంగా బీఆర్ఎస్ అవకాశాలు కల్పించిందని తెలిపారు. కామారెడ్డిలో కొంతమంది ఆత్మగౌరవ భవనాలు, కుల సంఘాలకు సహాయం చేస్తూ ప్రలోభాలకు గురిచేస్తున్నారని తెలిసిందని, ఆత్మగౌరవ భవనాలను ఇచ్చింది బీఆర్ఎస్సే అన్నారు. జనగణన చేపడితే రిజర్వేషన్లకు అనుకూలంగా ఉంటుందని, జనగణన చేయడానికి బీజేపీ వెనుకంజ వేస్తోందన్నారు. వర్గీకరణ కోసం కమిటీ వేశామని ప్రధాని మోదీ చెప్పిన మాటలు మోసపూరితంగా ఉన్నాయన్నారు. కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ముదిరాజ్ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు అల్లుడు జగన్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ పున్న రాజేశ్వర్ పాల్గొన్నారు.

బాన్సువాడ బాద్‌షా ఎవరో?

- ఎత్తులు వేయడంలో ముగ్గురూ ముగ్గురే..
- అభివృద్ధి, లోకల్ నినాదంతో పోచారం
- ఆరు గ్యారంటీలతో జనంలోకి ఏనుగు
- నీతివంతమైన పాలన అంటున్న యెండల
- రసవత్తరంగా మారిన ఎన్నికలు







సాక్షి, కామారెడ్డి: మంజీర నది తీరాన ఉన్న బాన్సువాడ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం హోరెత్తుతోంది. మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎత్తుకు పై ఎత్తులు వేయడలో ముగ్గురూ ముగ్గురే అన్నట్టుగా ఉన్నారు. ప్రచారంలో దూసుకుపోతున్నారు. ముగ్గురు అభ్యర్థులు రాజకీయంగా అనుభవం ఉన్నవారు కావడంతో పోటీ రసవత్తరంగా మారింది. బీఆర్ఎస్ అభ్యర్థి, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్నవారు. ఆయన మంత్రిగానూ పలుమార్లు పనిచేశారు. కాంగ్రెస్ అభ్యర్థి ఏనుగు రవీందర్‌రెడ్డి మూడు పర్యాయాలు ఎల్లారెడ్డి ఎమ్మెల్యేగా పనిచేశారు. బీజేపీ అభ్యర్థి యెండల లక్ష్మీనారాయణ సుదీర్ఘ కాలంగా బీజేపీలో కొనసాగుతున్నారు. ఒక పర్యాయం ఎమ్మెల్యేగా పనిచేశారు. నియోజకవర్గంలో మున్నూరు కాపులు, ఆంధ్ర సెటిలర్లు, మైనారిటీలు, ముదిరాజ్‌లు ఎక్కువగా ఉంటారు. ఎవరి ఓట్లు ఎటు వెళ్తాయన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. రాష్ట్రంలో ప్రభావం చూపే అంశాలన్నీ బాన్సువాడ నియోజకవర్గంలో కనిపిస్తాయి. బాన్సువాడ నియోజకవర్గం రెండు జిల్లాల్లో కలగలిసి ఉంటుంది. బాన్సువాడ పట్టణం, బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాలు కామారెడ్డి జిల్లాలో ఉండగా, కోటగిరి, వర్ని, రుద్రూర్, చందూర్, పోతంగల్, మోస్రా మండలాలు నిజామాబాద్ జిల్లా పరిధిలోకి వస్తాయి.

వరుస విజయాలతో..

ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో సీనియర్ నేతగా గుర్తింపు ఉన్న సిట్టింగ్ ఎమ్మెల్యే, అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి వరుస విజయాలతో ఊపు మీదున్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత మొదటి ఐదేళ్లలో మంత్రిగా, తర్వాత అసెంబ్లీ స్పీకర్‌గా నియోజకవర్గంలో అభివృద్ధికి భారీ ఎత్తున నిధులు తీసుకువచ్చారు. బాన్సువాడను మున్సిపాలిటీని చేసి, పురపాలక శాఖ ద్వారా భారీ ఎత్తు నిధులను రాబట్టి అభివృద్ధి చేశారు. పట్టణంలో మౌలిక వసతులు కల్పించారు. సాగునీటి సౌకర్యాలకు ప్రాధాన్యతనిచ్చారు. సిద్దాపూర్, జకోరా వంటి ఎత్తిపోతల పథకాలు పురోగతిలో ఉన్నాయి. డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణంలో రాష్ట్రంలోనే ముందువరుసలో నిలిచారు. పదకొండు వేలకు పైగా ఇళ్లు నిర్మించి లబ్ధిదారులకు అందించారు. తాను చేసిన అభివృద్ధి పనులే గెలిపిస్తాయన్న ధీమాతో ఉన్నారు.

ఇసుక దోపిడీపై ఆరోపణలు

బీజేపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ నీతివంతమైన పాలన కోసం బీజేపీని గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు. మంజీర ఇసుక దోపిడీపై ఆయన ఆరోపణలు చేస్తున్నారు. బాన్సువాడ నియోజక వర్గంలో ఏం జరుగుతుందో ఇక్కడి ప్రజలకు అంతా తెలుసని, ప్రజలు సరైన నిర్ణయం తీసుకుంటారన్న నమ్మకంతో ఉన్నారు. స్థానికంగా హిందుత్వ నినాదంతో పనిచేసిన వారంతా ఆయనకు సహకరిస్తున్నారు.

విస్తృత ప్రచారం..

కాంగ్రెస్ అభ్యర్థిగా ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి బరిలో నిలిచారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకు వెళ్తున్నారు. తన సతీమణి మంజులారెడ్డితో కలిసి నియోజక వర్గాన్ని చుట్టేశారు. తక్కువ సమయంలోనే ఎక్కువ గ్రామాలను తిరిగి ప్రజలకు కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను గురించి వివరించారు. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను తనకు అనుకూలంగా మలచుకునే ప్రయత్నం చేశారు. నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు చాలా వరకు ఆయనతో కలిసి ప్రచారంలో పాల్గొంటున్నాయి. తనను నాన్ లోకల్ అనడాన్ని రవీందర్‌రెడ్డి తిప్పికొడుతున్నారు. ఉద్యమంలో తాను జిల్లా అంతటా తిరిగానని, ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేసిన తనను పార్టీ నుంచి బయటకు వెళ్లేలా చేశారని ఆరోపిస్తున్నారు. తెలంగాణ కోసం కొట్లాడిన తనలాంటి వాళ్లంతా బయట ఉంటే, తెలంగాణ ద్రోహులంతా కేసీఆర్ వెంట ఉన్నారని ప్రజల్లో చర్చ పెట్టారు.



బాన్సువాడలో హాజరైన జనం

అభివృద్ధి చేశా.. అండగా ఉండండి

- బాన్సువాడ బీఆర్ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి



చందూర్‌లో మాట్లాడుతున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

వర్ని(చందూర్): బాన్సువాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని.. ఈ ఎన్నికల్లో ఓటర్లందరూ అండగా నిలబడి తనకు మద్దతు పలకాలని బాన్సువాడ బీఆర్ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి కోరారు. సోమవారం చందూర్‌లో నిర్వహించిన ప్రచారంలో ఆయన మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేశానన్నారు. సాగు, తాగు నీరు, విద్యుత్ ,వైద్యం, విద్యతోపాటు అన్ని సమస్యల పరిష్కారానికి కోట్లాది రూపాయలు మంజూరు చేశానని వెల్లడించారు. రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాల కంటే బాన్సువాడలోనే అభివృద్ధి అధికంగా జరిగిందని ఈ వాస్తవాన్ని గ్రహించి ఓట్లు వేయాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు చెప్పే మాటలను నమ్మకుండా అభివృద్ధిని కాంక్షించే తనకు అండగా నిలిచి గెలిపించాలని కోరారు. స్థానికుడిని అయిన తనను గెలిపిస్తే ప్రజలందరికీ అందుబాటులో ఉండి కుటుంబ సభ్యుడిగా అందరినీ కలుపుకొని అభివృద్ధికి పాటుపడతానన్నారు. డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి సురేందర్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, లావణ్యరామ్‌రెడ్డి, కవిత, అంబర్ సింగ్, సాయిరెడ్డి, సత్యనారాయణ, గంగారాం పాల్గొన్నారు.

ఎవరికీ అన్యాయం చేయలేదు

బాన్సువాడ: తన రాజకీయ జీవితంలో ఎప్పుడు తప్పు చేయలేదని, ఎవరికీ అన్యాయం చేయలేదని బాన్సువాడ బీఆర్ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం నుంచి తెచ్చిన ప్రతి రూపాయిని నియోజకవర్గ అభివృద్ధి కోసమే ఖర్చు చేశానన్నారు. సోమవారం పట్టణంలో ఆయన ప్రచారం చేశారు. సేవ చేసే నాయకుడిని గెలిపించుకోవాలని కోరారు. తనపై పోటీకి వచ్చిన కాంగ్రెస్ అభ్యర్థి ఏనుగు రవీందర్‌రెడ్డి దుర్మార్గుడన్నారు. ఆయన మాట వినని వారిని పోలీస్ స్టేషన్‌లో వేసి కొట్టిస్తారని ఆరోపించారు. ప్రతీ పనికి కమీషన్లు తీసుకునే వ్యక్తి మనకు అవసరమా అని ప్రశ్నించారు. డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కత్తెర గంగాధర్, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, అంజిరెడ్డి, కృష్ణరెడ్డి, పాత బాలకృష్ణ, మోహన్‌నాయక్, జుబేర్, అనిత, రమాదేవి, సరిత, కనుకుట్ల అనసూయ, ప్రతిమారెడ్డి, కిరణ్, గడుమల లింగం, రాజు, నర్సగౌండ ఉన్నారు.

తెలంగాణలోనే తండాల అభివృద్ధి

బాన్సువాడ రూరల్: తెలంగాణలోనే తండాలు అభివృద్ధి చెందాయని పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మోగులాన్‌పల్లి, మొగులాన్‌పల్లి తండాల్లో ఆయన ప్రచారం చేశారు. కేసీఆర్ సహకారంతో ప్రతి తండాలో సీసీరోడ్లు, డ్రెయినేజీలు నిర్మించామన్నారు. బద్యానాయక్, మోహన్‌నాయక్, పిట్ల శ్రీధర్, మల్లారెడ్డి, నూరామ్ పాల్గొన్నారు.

కేసీఆర్ పోటీ ఉత్తర తెలంగాణకు అదృష్టం

- రాజ్యసభ సభ్యుడు, మాజీ స్పీకర్ కేఆర్ సురేష్‌రెడ్డి



మాట్లాడుతున్న కేఆర్ సురేష్‌రెడ్డి

కామారెడ్డి రూరల్: కామారెడ్డి నుంచి సీఎం కేసీఆర్ పోటీ చేయడం ఉత్తర తెలంగాణ అదృష్టమని మాజీ స్పీకర్, రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేష్ రెడ్డి అన్నారు. చిన్న మల్లారెడ్డిలో సీఎం కేసీఆర్‌కు మద్దతుగా సోమవారం ప్రచారం చేసి మాట్లాడారు. బాగా నడిపే డ్రైవర్‌ను పక్కనపెట్టి కొత్త వ్యక్తులకు డ్రైవింగ్ అప్పగిస్తే బండి బోల్తాపడే అవకాశాలు ఉన్నాయని, ప్రజలు ఆలోచించి మంచి డ్రైవర్‌కే పాలన అప్పగించాలని కోరారు. ధాన్యాన్ని పండించడంలో దేశంలోనే రెండు కోట్ల 50 లక్షల టన్నుల ధాన్యాన్ని పండించి నంబర్ వన్ స్థానంలో తెలంగాణ నిలిచిందన్నారు. ఇలా నిలవడానికి సీఎం కేసీఆర్ పాత్ర ఎంతో ఉందన్నారు. దేశంలో ప్రస్తుతం రెండే రెండు అంశాలపై చర్చ జరుగుతుందన్నారు. ఒక పార్టీ కులాలపై మరో పార్టీ మతాలపై చర్చలు పెడుతుంటే కేసీఆర్ మాత్రం అభివృద్ధిపై చర్చలు పెట్టడం హర్షించదగ్గ విషయం అన్నారు. ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు, వైస్ ఎంపీపీ ఉరుదొండ నరేష్, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ ప్రజలకే తొలి ప్రాధాన్యత



బోర్లంలో ప్రచారం చేస్తున్న సోనీరెడ్డి

బాన్సువాడ రూరల్: స్పీకర్‌గా ఉన్నత స్థాయి పదవిలో ఉన్నా కూడా మామయ్య పోచారం శ్రీనివాస్‌రెడ్డి తన కుటుంబ సభ్యుల కంటే నియోజకవర్గ ప్రజలకే తొలి ప్రాధాన్యత ఇస్తారని చిన్న కోడలు పోచారం సోనీ రెడ్డి అన్నారు. సోమవారం ఆమె బోర్లంలో సర్పంచ్ సరళ, ఎంపీటీసీ శ్రావణి, మహిళా ప్రతినిధులు సంగం గంగామణి, రామలక్ష్మి తదితరులతో కలిసి ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి పరితపిస్తున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని కోరారు. అనంతరం ర్యాలీలో పాల్గొన్నారు. ఏఎంసీ చైర్మన్ నర్సింలు, పార్టీ గ్రామ అధ్యక్షులు గోపన్‌పల్లి సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మండలంలో 30 పడకల ఆస్పత్రి

- ఎల్లారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్



బాండ్ పేపర్లు చూపుతున్న మదన్‌మోహన్

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందగానే ప్రజల వద్దకు పాలన కార్యక్రమాన్ని నిర్వహించడం , ప్రతి మండలంలో 30 పడకల ఆస్పత్రి నిర్మిస్తామనని ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మదన్‌మోహన్ రావు అన్నారు. సోమవారం ఎల్లారెడ్డిలో సమావేశం నిర్వహించి ఎమ్మెల్యేగా గెలుపొందగానే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తానని బాండ్ పేపర్లు విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తానన్నారు. అలాగే ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, స్టోరేజ్ కేంద్రాల ఏర్పాటు చేస్తానన్నారు. నియోజకవర్గంలోని పేదలందరికి పక్కా ఇళ్ల నిర్మాణం చేపడతానని చెప్పారు. తనకు వచ్చే జీతంలో ఒక్క రూపాయి మాత్రమే తీసుకుని మిగితా వేతనాన్ని నిరుపేదల ఇంటి నిర్మాణం కోసం వెచ్చిస్తానన్నారు. కొత్త రేషన్ కార్డులను మంజూరు చేయడంతో పాటు, ప్రజల వద్దకు పాలనలో భాగంగా ప్రజలు అధికారుల చుట్టు తిరగకుండా ప్రతి మండలంలో హెల్ప్ సెంటర్లు ఏర్పాటు చేసి అధికారులను అక్కడికే తీసుకువచ్చి ప్రజల సమస్యలకు పరిష్కారం జరిగేలా కృషి చేస్తానన్నారు. బోధన్ నుంచి బీదర్‌కు వెళ్లే రైలు మార్గం ఎల్లారెడ్డి మీదుగా వెళ్లేలా కేంద్ర ప్రభుత్వంతో చర్చిస్తానన్నారు. తాను ఎక్కడికి పోనని స్థానికంగా ఉండి ప్రజలకు సేవ చేస్తానన్నారు. నాయకులు రాంచందర్‌రెడ్డి, నామాల శంకర్, సంజీవరెడ్డి, విఠల్‌రెడ్డి, శ్రీధర్‌గౌడ్ తదితరులున్నారు.

ప్రజాసేవ చేసే అవకాశం ఇవ్వండి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఎన్నికల్లో చెయ్యి గుర్తుకు ఓటు వేసి ప్రజాసేవ చేసే అవకాశం తనకు ఇవ్వాలని కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్ కోరారు. బొల్లారం, జప్తిజాన్కంపల్లి, మెల్లకుంటతండాలో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మారెడ్డి సర్పంచ్ శ్రీధర్‌గౌడ్, నాయకులు విఠల్‌రెడ్డి, మురళీగౌడ్, వర్జ్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో కాంగ్రెస్ నాయకుల ర్యాలీ



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి పట్టణంలో మదన్‌మోహన్ సోమవారం భారీగా ర్యాలీ నిర్వహించారు. పార్టీ కార్యాలయం నుంచి గాంధీచౌక్, వైశ్య భవన్, పోలీస్‌స్టేషన్ మీదుగా అంబేద్కర్ చౌరస్తా వరకు బైక్ ర్యాలీ తీశారు. కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శి సక్కాల్‌సింగ్, కాంగ్రెస్ నాయకులు గయాజుద్దీన్, చెన్న లక్ష్మణ్, సామెల్, విద్యాసాగర్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులున్నారు.

క్రైం కార్నర్

లారీని ఢీకొని ఒకరికి గాయాలు



మోపాల్: మండలంలోని బోర్గాం(పి) శివారులో సోమవారం రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని కోటగల్లికి చెందిన లింబాద్రి మోపాల్ నుంచి నిజామాబాద్ వైపు బైక్‌పై వస్తున్నాడు. వాహనం అదుపు తప్పి ముందు వద్ద లోడ్‌తో వెళ్తున్న లారీని ఢీకొంది. ప్రమాదంలో లింబాద్రికి తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు. లింబాద్రి మార్కండేయ మందిరంలో పూజారిగా ఉన్నారు.

పలువురిపై కేసు

మోపాల్: మండలంలోని ముదక్‌పల్లిలో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం ఫిర్యాదు మేరకు పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ గంగాధర్ సోమవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నిజామాబాద్ రూరల్ బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ ఎన్నికల ప్రచారం నిమిత్తం ముదక్‌పల్లికి వచ్చారు. ఆయన ప్రసంగిస్తున్న సమయంలో కొందరు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఆ తర్వాత బాజిరెడ్డి గోవర్ధన్ వెళ్లిపోయారు. ఈక్రమంలో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

ఆటో ఢీకొని గురుకుల విద్యార్థి మృతి



సయ్యద్ అహ్మద్ (ఫైల్)

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్ మైనారిటీ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న సయ్యద్ అహ్మద్(11) ఆటో ఢీకొని చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై మహేష్, ఆర్‌సీవో అబ్దుల్ బషీర్ తెలిపారు. వివరాలు.. నిజామాబాద్ నగరం బాబన్ సాహెబ్ పహడ్, వెంగల్‌రావు కాలనీకి చెందిన అహ్మద్ గురుకుల పాఠశాలలో చదువుతున్నాడు. ఆదివారం బాలుడి అమ్మమ్మ బేగం బీ, చిన్నమ్మ హైమాదీ బేగం పాఠశాలకు వచ్చారు. హైమదీ బేగం పిల్లలు కూడా ఇదే పాఠశాలలో చదువుతున్నారు. ముగ్గురు పిల్లలను సమీపంలోని దర్గా వద్దకు తీసుకెళ్లి తమ వెంట తెచ్చిన భోజనం తినిపించారు. అనంతరం తిరిగి పాఠశాలకు వెళ్లడానికి రోడ్డు పైకి వచ్చారు. అదే సమయంలో డిచ్‌పల్లి నుంచి ముల్లంగి(ఐ) వైపు వెళ్తున్న ప్యాసింజర్ ఆటో అహ్మద్‌ను ఢీకొంది. వెంటనే ఆటో డ్రైవర్ ప్రయాణికులను అక్కడే దింపి, అహ్మద్‌ను మొదట డిచ్‌పల్లిలోని ప్రభుత్వ ఆస్పత్రికి అక్కడి నుంచి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందాడు. బాలుడి తల్లి రిజ్వానా బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనారోగ్యంతో వృద్ధురాలి ఆత్మహత్య

మోపాల్: మండలంలోని న్యాల్‌కల్‌కు చెందిన మచ్చ గంగమణి (67) నిజాంసాగర్ కెనాల్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌హెచ్‌వో గంగాధర్ సోమవారం తెలిపారు. గంగమణి భర్త గతంలోనే మృతి చెందాడు. కొడుకు నిజామాబాద్ నగరంలో ఉంటున్నాడు. దీంతో ఆమె ఒంటరిగా ఉంటోంది. ఆమె కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. ఈ సమస్య తాళలేక ఆదివారం కెనాల్‌లో దూకి ఆత్మహత్య చేసుకుంది. సోమవారం ఆమె మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని పంచనామ నిర్వహించారు. మృతురాలి కొడుకు నర్సింలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

కుంటలో పడి మహిళ మృతి

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండలం వెల్లుట్లలో నీటి కుంటలో పడి మహిళ మృతి చెందినట్లు గ్రామస్తులు సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన మంగళి అనిత (24) దుస్తులు ఉతికేందుకు వెళ్లి కాలు జారి కుంటలో పడిపోయింది. మృతురాలికి భర్త రమేశ్, ఏడాదిన్నరు కుమారుడు ఉన్నారు.

పాపను వదిలి వెళ్లారు



నిజామాబాద్ రూరల్: రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గాంధీనగర్ తండాలో ఆదివారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు పాపను వదిలి వెళ్లారని ఎస్‌హెచ్‌వో మహేశ్ తెలిపారు. ఏడాది వయసు గల ఆ పాపను చైల్డ్ వెల్ఫేర్ సెంటర్‌లో అప్పగించామన్నారు. పాప వివరాలు తెలిస్తే 8712659849 నంబర్ సంప్రదించాలని కోరారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి



దోమకొండ: మండలంలోని చింతమాన్‌పల్లిలో నీల చంద్రంకు చెందిన గేదె సోమవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. వ్యవసాయ పొలం వద్ద గడ్డి మేస్తుండగా, ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తగిలి గేదె మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

డబ్బులు పంచేందుకు వచ్చాడని అనుమానంతో..

- ర్యాగట్లపల్లిలో ఒకరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- కంచర్లలో కర్ణాటక వాహనం పోలీసుస్టేషన్‌కు తరలింపు

భిక్కనూరు: మండలంలోని ర్యాగట్లపల్లిలో ఒక అనుమానితుడిని భిక్కనూరు పోలీసులు సోమవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. గ్రామంలో గాంధీ విగ్రహం వద్ద కూర్చున్న ఇతర ప్రాంతానికి చెందిన వ్యక్తిని గ్రామస్తులు కొందరు గుర్తించి ఆయనను ప్రశ్నించగా ఆ వ్యక్తి సరైన సమాధానం ఇవ్వలేదు. దీంతో కొందరు బీఆర్ఎస్ నేతలు ఈ వ్యక్తి కాంగ్రెస్ పార్టీ తరఫున డబ్బులు పంచేందుకు గ్రామానికి వచ్చాడంటూ పోలీసులకు ఫోనులో సమాచారం అందించారు. దీంతో పోలీసులు వెంటనే గ్రామానికి వచ్చి ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఆ వ్యక్తి గ్రామంలో తిరుగుతూ ఎన్నికల సర్వే చేశారని పలువురు గ్రామస్తులు అంటున్నారు. ఈ విషయాలు గ్రామంలో వ్యాపించడంతో గ్రామస్తులు అందరూ గాంధీ విగ్రహం వద్దకు చేరుకున్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలు ఒకరిపై మరొకరు ఆరోపణలు ప్రత్యారోపణలు చేసుకున్నారు. పోలీసులు ఇరు పార్టీల వారిని శాంతపరిచి ఆ వ్యకిని పోలీసు స్టేషన్‌కు తరలించారు. అలాగే భిక్కనూరు మండలం కంచర్లలో తిరుగుతున్న కర్నాటకకు చెందిన ఒక వాహనాన్ని గ్రామ బీఆర్ఎస్ నేతలు పట్టుకుని పోలీసులకు సమాచారం అందించడంతో వారు కంచర్ల గ్రామానికి వెళ్లి ఆ వాహనాన్ని భిక్కనూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు కార్యకర్తలు భిక్కనూరు పోలీస్‌స్టేషనుకు భారీగా తరలివచ్చారు. ఈ విషయం తెలుసుకున్న కామారెడ్డి డీఎస్పీ ప్రకాష్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఇరు పార్టీల నేతలు, కార్యకర్తలను బయటకు పంపించారు.

గ్రహణం వీడాలంటే సూర్యుడ్ని గెలిపించాలి



చీకోటిని సన్మానిస్తున్న ధన్‌పాల్

సుభాష్‌నగర్: ఇందూరు నగరానికి గ్రహణం పట్టిందని, ఆ గ్రహణం వీడాలంటే సూర్యుడి (ధన్‌పాల్ సూర్యనారాయణ)ని గెలిపించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు చీకోటి ప్రవీణ్ అన్నారు. సోమవారం నగరంలో బీజేపీ అర్బన్ అభ్యర్థి ధన్‌పాల్ సూర్యనారాయణ తరఫున ప్రచారం చేశారు. చీకోటి ప్రవీణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో హిందుత్వంపై ప్రశ్నిస్తే కేసులు నమోదు చేస్తున్నారన్నారు. బీజేపీ ముస్లింలకు వ్యతిరేకం కాదని, హిందు దేవుళ్ల, దేవతలను కించపర్చే వారికి మాత్రమే వ్యతిరేకమన్నారు.

బీజేపీతోనే మహిళలకు రక్షణ

దేశంలో మహిళలకు రక్షణ కల్పించేది బీజేపీయే అని సినీ నటి కవిత పేర్కొన్నారు. నగరంలోని గాంధీచౌక్‌లో బీజేపీ అర్బన్ అభ్యర్థి ధన్‌పాల్‌కు మద్దతుగా ఆమె ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మహిళా మోర్చా నాయకులు భారీ ర్యాలీతో మద్దతు పలికారు.

పీఎఫ్ఐకి అడ్డాగా మార్చారు

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఇందూరు నగరాన్ని పీఎఫ్ఐకి అడ్డాగా మార్చారని బీజేపీ అర్బన్ అభ్యర్థి ధన్‌పాల్ సూర్యనారాయణ ఆరోపించారు. కమలం పువ్వు గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజలు మార్పు కోరుకుంటున్నారు



బాన్సువాడ రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, కాంగ్రెస్ సునామీలో బీఆర్ఎస్ పార్టీ కొట్టుకు పోవడం ఖాయమని ఆ పార్టీ బాన్సువాడ అభ్యర్థి ఏనుగు రవీందర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన టీపీసీసీ సభ్యులు కాసుల బాలరాజుతో కలిసి సోమేశ్వర్, దేశాయిపేట్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించి, గట్టుమీది గ్రామాల్లో చేపట్టిన బైక్‌ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ గెలిస్తే ప్రస్తుతం అమలు అవుతున్న పథకాలు, అభివృద్ధి పనులు ఏవీ కూడా ఆపమని స్పష్టం చేశారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

బాన్సువాడ: బీర్కూర్ మండలం దామరంచ గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు సోమవారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఏనుగు రవీందర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.